ప్రజాశక్తి
గురువారం 04 జనవరి 2024
5
కర్నూలు



ఆధార్ ఉంటేనే ఉపాధి

- ఉపాధి కోతకు కేంద్రం కుట్ర
- ఆధార్‌తో వేతనానికి అనుసంధానం



తుగ్గలి మండలం రాంపల్లిలో ఉపాధి పని చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నిరుపేదలకు ఆసరాగా నిలుస్తున్న ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం పలురూపాల్లో తూట్లు పొడుస్తూ వస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ఉపాధి కుదింపు చర్యలు మొదలుపెట్టింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా ఉపాధి హామీకి ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్‌ను ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తోంది. నేషనల్ పేమెంట్ ఇండియా లిమిటెడ్ ద్వారా కూలీలకు వారి ఖాతాల్లో డబ్బులు వేసేందుకు గతేడాది కాలంగా ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది. ప్రభుత్వం అనుకున్న పని నెరవేరడంతో అమలుకు సిద్ధమైంది...

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేసే విధానాలను అవలంభిస్తూ వస్తోంది. తొలుత యాక్టివ్ వర్కర్లతో పేరుతో కుదింపు చర్యలు మొదలుపెట్టింది. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 నుంచి ఎపిని కూడా ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. ఆ క్రమంలో కూలీలు కొన్ని సౌకర్యాలను కోల్పోయారు. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు. ఎండలతో భూమి గట్టిపడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవిభత్యం కింద అదనంగా చెల్లించేవారు. 2021-22 నుంచి దాన్నీ ఆపేశారు. కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ ఆపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానాన్నీ నిలిపేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కూలీలకు తానే డబ్బులు చెల్లిస్తూ వస్తోంది. ఇకపై చెల్లింపులన్నీ తానే చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చెల్లింపు బాధ్యతలను నేషనల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్)కు అప్పగించింది. వారు కూలీలకు సంబంధించిన వివరాలతో పాటు బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లను సేకరించారు. ఈ ప్రక్రియలో ఆధార్ నంబరుకు, ఎన్‌పిసిఎల్‌కు లింకు కుదరలేదు. దీంతో బ్యాంకు ఖాతాతో ఉన్న ఆధార్ నంబరును ఒకసారి తొలగించి, కొత్తగా లింక్ చేయించాలని అధికారులకు సూచించింది. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ పని చేయించినా చాలాచోట్ల కుదరలేదు. లింక్ కాని వారితో పోస్టల్ ఖాతాలనూ తెరిచారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో విడిచిపెట్టేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే జిల్లాలో 3.18 లక్షల జాబ్‌కార్డులు, 6.07 లక్షల కూలీలు ఉండగా 5.95 లక్షల మంది కూలీల వివరాలు ఆధార్‌తో లింక్ అయ్యాయి. వీరిలో ఆధార్ లింక్ కాని వారు, వలసలు వెళ్లిన వారి వివరాలు అనుసంధానం కాలేదు. ఆధార్ అనుసంధనం లేకపోవడంతో వీరంతా ఉపాధి పనులకు దూరంగా కానున్నారు. అప్‌డేట్ అవుతున్న వారిని మినహాయించి 99 శాతానికి పైగా అనుసంధానం పూర్తయినట్లు లెక్కలు చెప్తున్నారు. చెల్లింపులే అసలు సమస్యఇప్పటివరకు కొత్త విధానం ద్వారా కూలీలకు ఇంకా చెల్లింపులు ప్రక్రియ మొదలు కాలేదు. డబ్బులు ఖాతాలో వేస్తే ఎంతమందికి జమ అయ్యాయో, ఎంతమందికి కాలేదో తెలుస్తోంది.

చెల్లింపులో జాప్యం చేయడానికే...



ఇప్పటికే బ్యాంకు ఖాతాలకు ఆధార్ వివరాలను లింక్ చేశారు. మరి కొత్తగా జాబ్‌కార్డులకు ఆధార్‌తో లింక్ ఎందుకు? ఇది ఒక రకంగా కూలీలకు వేతనం చెల్లింపులో జాప్యం చేయడానికే. ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించినా ఇప్పటికీ సహాయక చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వం పనిదినాలను 150 రోజులకు పెంచుతామని చెప్పినా ఆ మేరకు చర్యలు చేపట్టలేదు. పని దినాలను 200 రోజులకు పెంచి కూలీలకు అదనంగా పని కల్పించాలి.

- కెవి.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

అంగన్వాడీల ఆధ్వర్యంలో

కలెక్టరేట్ దిగ్బంధం

- 4 గంటలకు పైగా ముట్టడి - భారీగా పోలీసుల మోహరింపు - డిఆర్ఒకు వినతి
- పరిష్కారమయ్యే వరకు వెన్నంటే ఉంటాం - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. వందలాదిమంది అంగన్వాడీలు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని నాలుగు గంటలకు పైగా దిగ్బంధించి నిరసన తెలిపారు. కలెక్టరేట్ చుట్టూ పోలీసులను మోహరించి ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒక డిఎస్‌పి, నలుగురు సిఐలు, ఎస్ఐ, ఎఎస్ఐలతో పాటు పోలీస్ కానిస్టేబుళ్లతో ముట్టడి శిబిరం వద్ద మోహరించారు. పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా అంగన్వాడీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యారికేడులను పక్కకి తోసేసి కలెక్టరేట్ గేట్లు తెరుచుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. పోలీసులకు అంగన్వాడీలకు మధ్య కొంతసేపు తోపులాట జరిగింది. వెంటనే డిఆర్ఒ మధుసూదన్ రావుకు సమాచారం అందజేశారు. ముట్టడి శిబిరం వద్దకు వచ్చి అంగన్వాడీ యూనియన్ ప్రతినిధుల నుండి వినతి పత్రాన్ని స్వీకరించారు. ఈ సమస్యలన్నింటినీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎఐటియుసి నగర కార్య దర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ మాట్లాడారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే రూ.1000 ఎక్కువ వేతనాలు ఇస్తామని, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామని మాట ఇచ్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. కింది స్థాయి నుంచి చలో విజయవాడ వరకు అంచలంచెలుగా ఆందోళనలు పోరాటాలు చేసినప్పటికీ పట్టించుకోక పోవడంతో తప్పనిసరి పరిస్థితులలో డిసెంబర్ 12 నుండి నిరవధిక సమ్మె మొదలై 23 రోజులైనా పట్టి పట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సమ్మెను విచ్చిన్నం చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూన్నారన్నారు. అయినా అంగన్వాడీలు పట్టుదలతో పోరాటాన్ని కొన సాగిస్తూనే ఉన్నారన్నారు. ఈ పోరాటాన్ని సమస్యలు పరిష్కా రం అయ్యేవరకు కొనసాగించాలన్నారు. సిఐటియు సంపూర్ణంగా మద్దతినిస్తుందన్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నిర్మలమ్మ, ఎఐటియుసి, సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎం డి.అంజిబాబులు మా ట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను నీరుగార్చడానికి అంగన్‌వాడీ సెంటర్లను బల వంతంగా తెరవడానికి, సరుకులు పంపిణీ చేయడానికి అన్ని రకాల ఉద్యోగులను, చివరికి సచివాలయ ఉద్యోగులను పురమాయించి నప్పటికీ సాధ్యం కాలేదన్నారు. ఈ చర్యలను అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ధైర్యంగా అడ్డుకున్నారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రేణుకమ్మ, వర లక్ష్మి, గోవర్ధనమ్మ, కాంతమ్మ, విజయం భారతి, పద్మ, జ్యోతి, సిఐటియు, ఎఐటియుసి నాయకులు ప్రభాకర్, సిహెచ్ సాయిబాబా, నరసింహులు, అబ్దుల్లా, వెంకటేశులు, శ్రీనివాసులు, గోపాల్, సుధాకరప్ప, రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న అంగన్వాడీలను, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



కలెక్టరేట్ ముట్టడిని ఉద్దేశించి మాట్లాడుతున్న గఫూర్

బాశెట్టి లతకు సావిత్రి భాయిపూలే అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

సావిత్రి బాయి పూలే 193వ జయంతి ఉత్సవంలో భాగంగా కర్నూలు కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న రచయిత్రి డాక్టర్ బాశెట్టిలత సావిత్రిబాయిపూలె అవార్డును అందుకున్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రవీంద్రభారతి లో తెలంగాణా రాష్ట్ర బిసి సంఘం చైర్‌పర్సన్ బి.మణి మంజరి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి పూలే అవార్డు అందుకున్నారు. తెలుగుభాషా, సాహిత్య, సామాజిక రంగాలలో విశేషంగా కృషి చేసినందుకు ఈ అవార్డు ఇచ్చారని డాక్టర్ బాసెట్టిలత తెలిపారు.



ఓటర్ దరఖాస్తుల పక్కాగా పరిశీలన : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఓటర్ నమోదు దరఖాస్తులను పక్కగా పరిశీలన చేస్తున్నామన్నారు. ఓటర్ జాబితా సవరణపై జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీలనాయకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే నిర్దేశించిన ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సవరణలు కోరుతూ ఎక్కువ సంఖ్యలో వచ్చిన దరఖాస్తులకు (ఫార్మ్) సంబంధించి కర్నూలు మూడవ స్థానంలో ఉందని , నెల్లూరు, విశాఖపట్నం జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. వచ్చిన ప్రతి ఫారంను ఎన్నికల కమిషన్ నియమనిబంధనల ప్రకారం డిస్పోస్ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు , ఎన్నికల సెల్ సూపరింటెంట్ మురళి పాల్గొన్నారు.

2,48,072 మంది పెన్షన్ పెంపు ప్రయోజనం

జిల్లాలో 2,48,072 మందికి పెన్షన్ పెంపు ప్రయోజనం కలిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం వైఎస్ఆర్ పెన్షన్ మంజూరు కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి పెన్షన్ పంపిణీ ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ జి.జృజన, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సుధాకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, డిసిఎంఎస్ చైర్మన్ సిహెచ్.శిరోమణి మద్దయ్య, డిఆర్‌డిఎ పిడి సలీం బాషా, లబ్ధిదారులు తదితరులు వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ . జిల్లాలో జనవరి నెలలో 2,48,072 మందికి పెన్షన్లు ఇస్తున్నామన్నారు. ఇందులో 3,374 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. జిల్లాలో 2,48,072 మంది వివిధ రకాల పెన్షన్ దారులకు రూ.74.45కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నేటి నుండి 8 వ తేదీ వరకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పూర్త చేస్తామన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పెన్షన్ లబ్దిదారులకు కార్డులు పంపిణీ చేశారు.



వైఎస్ఆర్ పెన్షన్ కానుక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న , మోహన్ , మున్సిపల్ కార్మికులు

ఎమ్మెల్యేకు మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-గూడూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం కోసం చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మె గూడూరులో 9 రోజుకు చేరుకుంది. గూడూరుకు వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ నాయకత్వంలో మున్సిపల్ కార్మికులు వినతి పత్రాన్ని అందజేవారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక నాయకులు శాంతన్న, మనోహరమ్మ, జె. మోహన్ మాట్లాడుతూ 2019 ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కార్మికులందరికీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదేళ్లు కావస్తున్నా ఆ హామీ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్మికులు గ్రేసమ్మ, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, నాగరాజు, సూర్యశేఖర్, రాము పాల్గొన్నారు.



క్లాప్ డ్రైవర్ల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు 18వ రోజు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. రెడ్డిఏజెన్సీ, వైసిపి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ క్లాప్ డ్రైవర్లు వినూత్నరీతిలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఓల్డ్ సిటీ సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్, అధ్యక్షత వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.విజయ్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రెడ్డి ఏజెన్సీకి, వైసిపి ప్రభుత్వానికి, మున్సిపల్ అధికారులకు కనువిప్పు కలగాలన్నారు. గత 12 నెలలుగా జీతాలు ఇవ్వకుండా కార్మికుల కడుపు మార్చడం చాలా దుర్మార్గమన్నారు. నగర ఉపాధ్యక్షులు కుమార్, క్లాప్ డ్రైవర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల కోసం యుటియఫ్ పోరుబాట

పలువురి సంఘీభావం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

గతంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అము చేయాలని, ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఆర్థిక బకాలయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు ధర్నా చౌక్ 12 గంటల నిరసన పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన ఆధ్వర్యంలో పోరుబాట ధర్నా చౌక్‌లో నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి ,జిల్లా సహధ్యక్షుడు హేమంత్‌లు మాట్లాడారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మాట తప్పను ,మడమ తిప్పను, అంటూ ఇచ్చిన ప్రతి హామీ సాధించే వరకు పోరాటం చేయాలన్నారు. ప్రతి నెలా 1న జీతాలు, పిఆర్‌సి, డిఎలు, పిఎఫ్, ఎపిజిఎస్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధనకు ఈ పోరుబాట నిర్వహిస్తున్నామన్నారు. పిఆర్‌సి, డిఎ అరియర్లు రూ.7,382 కోట్లు, పిఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్ పేమెంట్లు 1,000 కోట్లుకొత్త డిఎ అరియర్లు (2 డీఏలు) రూ. 4884 కోట్లు, ఎపిజిఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు రూ.330 కోట్లు, సరండర్ లీవులు వగైరా రూ. 4,500 కోట్లు మొత్తం రూ.18,096 కోట్లు, 11వ పిఆర్‌సి బకాయిలు తక్షణమే చెల్లించాలని, 30శాతం ఐఆర్‌తో 12వ పిఆర్‌సి అమలు చేయాలని, 11వ పిఆర్‌సి బకాయిలు రూ. 7,382 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. 01.07.2023 2023 జులై ఒకటి నుంచి 30 శాతం ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలన్నారు. అప్పుడే ఉద్యోగి రెట్టించిన ఉత్సాహంతో పేదవాడికి మంచి చేయడానికి ఆరాటపడే పరిస్థితి వస్తుందన్నారు. సీనియర్ అడ్వకేట్ జయరాజు, మాదన్న, హెడ్మాస్టర్ల అసోసియేషన్ తరపున అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఎస్ టి రాముడు మద్దతు తెలిపారు. గౌరవాధ్యక్షులు దావీదు, ట్రెజరర్ యెహోషువ ,నరసింహ, ఎటి తిమ్మన్నా ,హనుమంతు, కిషోర్ ,దేవపాల్, ప్రతి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నుండి అధిక సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు సర్వేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.



యుటిఎఫ్ పోరుబాట కార్యక్రమానుద్దేశించి మాట్లాడుతున్న సురేష్‌కుమార్

సావిత్రిబాయి పూలే జయంతిని బాలికా అక్షరాస్యతా దినంగా పాటించాలి



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి కెవిపిఎస్ నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్య కొందరికే సొంతమన్న సాంప్రదాయ సంకెళ్ళను తెంచి అన్ని తరగతుల ప్రజానీకానికి, ప్రత్యేకంగా మహిళలకు పంచేందుకు అనేక అవమానాలు ఎదుర్కొన్న మాత సావిత్రిబాయి పూలే జయంతిని బాలికా అక్షరాస్యతా దినంగా పాటించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరం, జోహరాపురం షడక్ నగర్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు నిర్వహించారు. జనవరి 03ను బాలిక అక్షరాస్యత దినంగా పాటించాలని కోరుతూ కెవిపిఎస్ ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఆర్.రమణ అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, ఓల్డ్ సిటీ కార్యదర్శి గురుస్వామి, జిల్లా మహిళా నాయకులు విజయమ్మ మాట్లాడారు. 192 సంవత్సరాల క్రితం పుట్టిన ఒక మహిళను కీర్తిస్తూ నేడు దేశం మొత్తం జన్మదిన వేడుకులను నిర్వహిస్తున్నారంటే ప్రతి మహిళా గర్వపడాలన్నారు. సాంప్రదాయ సంకెళ్లతో శూద్రులే కాదు, బ్రాహ్మణ, క్షత్రియ ,వైశ్య ,మహిళలు కూడా చదవరాదంటూ బందీని చేసిన వ్యవస్థను బద్దలుకొట్టి, అనేక రకమైన అవమానాలను ఎదుర్కొని, విద్య ద్వారా మాత్రమే సమాజం మరింత చైతన్యమైన సమాజంగా మారుతుందని భావించారన్నారు. జిల్లా నాయకులు చక్రపాణి, నాగరాజు మాట్లాడారు. మహిళా నాయకులు వేణమ్మ, విజయ కుమారి, జోహరాపురం వార్డు కార్యదర్శి మౌలాలి, నాయకులు కృష్ణ, రాము, చందు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘణంగా నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క ముందుగా సావిత్రీభాయి చిత్ర పటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన కావించారు. వారు సావిత్రీభాయి గురించి వివరించారు.

రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో : ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి కర్నూలు రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సంఘం న్యూ సిటీ కార్యదర్శి సి.శేషాద్రి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు సి. గురుశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడారు. రజక వత్తిదారుల సంఘం ఓల్డ్ సిటీ అధ్యక్షురాలు సి. జయమ్మ, మహిళా కార్యకర్తలు, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్ బాబు, ఎల్లయ్య, న్యూ సిటీ నాయకులు కర్రన్న, మద్దిలేటి, నరసింహ, గోవిందు ,నాగరాజు ,వీరేష్, శేఖర్ పాల్గొన్నారు.



రజకవృత్తిదారుల సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ యూనిస్‌బాష

విద్యతోనే పేదల బతుకుల్లో మార్పు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

పేదల బతుకుల్లో మార్పు రావాలంటే కేవలం విద్యతోనే అది సాధ్యమవుతుందని దాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కర్నూలు పదవ వార్డు కార్పొరేటర్ యూనిస్‌బాష అన్నారు. నగరంలోని 10వ వార్డ్, 25వ సచివాలయం పరిధిలో ఉన్న లబ్ధిదారులకు డిబిటి, నాన్ డిబిటీ, ద్వారా జగనన్న ప్రభుత్వంలో సుమారుగా రూ.13 కోట్ల 80లక్షలు నేరుగా తమ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాల బోర్డును, వైసిపి జెండాను వారు స్థానిక నాయకులతో కలసి ఆవిష్కరించారు. యూనిస్‌బాష మాట్లాడుతూ జగనన్న విద్య వైద్యం కోసం 2019 నుంచి ఇప్పటివరకు ప్రతీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సామాజిక వర్గాల కోసమే కృషి చేస్తున్నారన్నారు. నజీర్ ఖాన్, ఫరోజ్ ఖాన్, అలీ ఖాన్, ఎజాజ్, అలీ, ఖాదర్, షబ్బీర్ సచివాలయ కన్వీనర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



రజకుల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రజకుల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమవుతుందని కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి టిజి.భరత్ అన్నారు. బుధవారం నగరంలోని మౌర్య ఇన్‌లోని టిజి.భరత్ కార్యాలయంలో కర్నూలు సిటీ రజక యూత్ అధ్యక్షులు సూర్యనారాయణ, ఇతర సభ్యులు టిజి.భరత్ సమక్షంలో టిడిపిలో చేరారు.కండువాలు కప్పి వారికి టిజి.భరత్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపికి మద్దతు తెలిపిన రజకులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించేందుకు సమిష్టిగా కష్టపడాలని రజకులకు సూచించారు. రజకుల సంక్షేమం కోసం టిడిపి కృషి చేస్తుందన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్లే నగరం అభివద్ధి చెందుతుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో వైస్ ప్రెసిడెంట్ బాలరాజు, మధుబాబు, రఘువరన్, భరత్, మధు కుమార్, తదితరులు ఉన్నారు. టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎరిగేరి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిపి అమ్రేష్, వైసిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి గోవిందు, నాయకులు నీలకంఠ రెడ్డి, తోవి నర్సప్ప, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బీవీ మద్దతు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీవీ

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి కె.ప్రసాద్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకృష్ణ, ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్షలు 8వ రోజుకు చేరాయి. పోలీసులు మున్సిపల్ కార్మికులను నిర్బంధించేందుకు ప్రయత్నించడంతో వామపక్ష నాయకులు అడ్డుకున్నారు. దీక్షలకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. బీవీతోపాటు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొండయ్య చౌదవి మద్దతు తెలిపారు. అలాగే ఐఎఫ్‌టియు నాయకులు హనీఫ్, బీసీ సంఘ నాయకులు గణేస్, రామచంద్ర మద్దతు తెలిపారు. కార్మికులు నాగరాజు, ఎల్లప్ప, కేశన్న, రవి, అల్లాబకాష్, శైలజ, అరుణమ్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించిన జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు



ఆర్థిక సాయం అందజేస్తున్న విరుపాక్షి

చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన తలారి షేకన్న కుమారుడు తలారి శ్రీరాములు (30) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు తరలించే వాహనానికి డ్రైవర్‌గా పని చేసే వారు. ఉదయం గుండెనొప్పి ఉందని కుటుంబీకులకు తెలపడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతునికి భార్య పుల్లమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్న వయస్సులో మృతి చెందారని, భార్య పిల్లలు, తల్లిదండ్రులు అనాథలయ్యారని కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు రోధించారు.

బాధిత కుటుంబానికి విరుపాక్షి పరామర్శ

తలారి శ్రీరాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని, చిన్నారులను చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.

పేదలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ప్రజాశక్తి - ఆదోని

పేదలను లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, జెసిఎస్ కన్వీనర్ ఫయాజ్ అహ్మద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. బుధవారం ఆదోనిలోని 34వ వార్డులో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. 2024లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని, సాయి ప్రసాద్ రెడ్డిని గెలిపించుకుంటే రాష్ట్రంతో పాటు ఆదోని మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కె.రామచంద్ర, కె.రామస్వామి, కె.నరేంద్ర, కె.సాయినాథ్, బండే నవాజ్, మాబాష, కట్టేగర్ మాబు, ఇబ్రహీం, కె.మల్లికార్జున, కె.గోపాల్, మనియార్ షేక్షావలీ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న డాక్టర్ మధుసూదన్

అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు

- రోడ్డుపై బైఠాయింపు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



దేవనకొండ రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు



గోనెగండ్ల పోలీసు స్టేషన్ వద్ద

ప్రజాశక్తి - దేవనకొండ

కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. గత 22 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న అంగన్వాడీల డిమాండ్లపై ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ కర్నూలు కలెక్టరేట్ ముట్టడికి బయల్దేరారు. దేవనకొండ, ఆస్పరి, ఆలూరు మండలాల అంగన్వాడీలను బుధవారం దేవనకొండ పోలీసులు ఈదుల దేవరబండ దగ్గర అడ్డుకొని కలెక్టరేట్ పోకూడదని నిలువరించారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వెళ్లి తీరుతామని అంగన్వాడీలు, సిఐటియు నాయకులు పట్టుబట్టారు. పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో ఈదుల దేవరబండ దగ్గర రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమను కలెక్టరేట్ పంపించే వరకు రోడ్డుపైనే అడ్డంగా కూర్చుంటామని భీష్మించుకొని, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, దేవనకొండ మండల కార్యదర్శి అశోక్ మాట్లాడారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం వైపు ప్రయత్నించాలని, నిర్బంధం పెడితే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలపై మాట్లాడకుండా, 'సమ్మె విరమించండి. అన్ని కల్పిస్తామ'ని కల్లబొల్లి మాటలు చెబుతోందని, మాట వినకుంటే అంతు చూస్తామని బెదిరిస్తోందని విమర్శించారు. రోడ్డుపై బైఠాయించిన సిఐటియు నాయకులు నారాయణస్వామి, అశోక్‌ను బలవంతంగా పోలీసు జీపు ఎక్కి ఎక్కించి అరెస్టు చేసిన నేపథ్యంలో అంగన్వాడీలు మూకుమ్మడిగా పోలీసు జీపును అడ్డుకుని, నాయకులను వదిలిపెట్టాలని పోలీసులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు సిఐటియు నాయకత్వంతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. అంగన్వాడీలు సుజాతమ్మ, జయశ్రీ, భారతి, సరస్వతి, లక్ష్మీ, ప్రభావతి పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో ఆదోని, కోసిగి, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల నుంచి గోనెగండ్ల మీదుగా కర్నూలుకు వెళ్తున్న సుమారు 300 మంది అంగన్వాడీలను గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డగించి అరెస్టు చేశారు. కొంతమందిని పోలీసు స్టేషన్‌కు తరలించడంతో పాటు మరి కొంతమందిని వారు వచ్చిన వాహనాల్లోనే పోలీసులను వెంటబెట్టి వారి వారి మండల పోలీసు స్టేషన్లకు తరలించి వెనక్కి పంపారు. బస్సులో వెళ్తున్న కొంతమందిని గోనెగండ్ల ఎస్సీ కాలనీ పాఠశాల వద్ద అడ్డుకొని బస్సులో నుంచి కిందికి దింపడంతో వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. కోసిగి, మంత్రాలయం మండలాలకు చెందిన సుమారు 50 మందికి పైగా అంగన్వాడీలు బస్సులు, జీపులు, ఆటోలో వెళ్తున్న వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి అక్కడే మధ్యాహ్నం వరకు ఉంచారు. వారు పోలీస్ స్టేషన్ ఆవరణలోనే నిరసన తెలిపారు. మంత్రాలయం సెక్టార్ నాయకులు లావణ్య దేవి మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం ఉద్యోగుల పేరుతో నవరత్న సంక్షేమ పథకాలను దరిచేరనీయకుండా కోత విధించి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలిపారు. తన భర్త చనిపోయి సుమారు ఆరేళ్లయిందని, తాను కుటుంబ ఖర్చులకు వేతనం సరిపోక వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగస్తురాలనే పేరుతో తిరస్కరిస్తున్నారని చెప్పారు. కోసిగి మండల నాయకులు లక్ష్మి మాట్లాడుతూ... పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ బాధలను చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వెళ్తున్న తమను పోలీసులను ప్రయోగించి ఎక్కడికక్కడ నిలువరించడం దారుణమని తెలిపారు. **ఆదోని (రూరల్)**లో అంగన్వాడీల జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని 23వ రోజు సమ్మె చేపట్టారు. కర్నూలు కలెక్టరేట్ ముందు ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీలను ఆదోని తాలూకా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. అంతకుముందు రోడ్డుపై ఒంటి కాలుపై నిలబడి నిరసన చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు నాయకులు వరలక్ష్మి, సరోజ, జానకి అధ్యక్షత చేపట్టారు. సిఐటియు నాయకులు తిప్పన్న, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, విజయ్, అంగన్వాడీలు పద్మ ,రేణుక, సరోజ, సోమక్క, గీత, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వానా, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **ఆస్పరి** నుంచి కలెక్టరేట్ ముట్టడికి బస్సులో వెళ్తున్న సిఐటియు నాయకులను, అంగన్వాడీలను హౌస్ అరెస్టు చేయడం దారుణమని సిఐటియు మండల గౌరవాధ్యక్షులు బాలకృష్ణ, నాయకులు హనుమంతు విమర్శించారు. ఆస్పరి, ఆలూరు ప్రాజెక్టు అంగన్వాడీలను ఎస్ఐ వరప్రసాద్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కలెక్టరేట్ ధర్నా ముగిసిన తర్వాత అంగన్వాడీలను పోలీసులు వదిలిపెట్టారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, ఆస్పరి, ఆలూరు అంగన్వాడీలు ఈరమ్మ, నాగమణి, లేపాక్షి, మస్తాన్ బీ, రాధమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు. **ఎమ్మినూరు**లో 23వ రోజు సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ముట్టడికి వస్తున్న అంగన్వాడీలపై పోలీసులు నిర్బంధం విధించి, అరెస్టు చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, నీరజ, శైలజ, నాగశిరోమణిని అరెస్టు చేశారు. అంగన్వాడీలపై నిర్బంధాన్ని వీడనాడాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి నాయకులు తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు నాయకులు కె.ప్రసాద్ డిమాండ్ చేశారు. **ఆలూరు** నుంచి కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో అంగన్వాడీల, సిఐటియు నాయకులకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. హాలహర్వి, హొళగుంద, చిప్పగిరి, ఆలూరు, ఆస్పరి మండలాల నుంచి ఉదయాన్నే ఎవరికి వారు బస్సుల్లో వెళ్తున్నా పోలీసులు కర్నూలుకు వెళ్లే రహదారిలో ప్రతి వాహనాన్నీ సోదాలు నిర్వహించి అంగన్వాడీలను గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆలూరులో ఉదయం 'వై' జంక్షన్ దగ్గర ఎఎస్ఐ తిరుమల నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోదాల్లో కర్ణాటకకు చెందిన బస్సులో వెళ్తున్న అంగన్వాడీల పట్ల దురుసుగా ప్రవర్తించి బస్సులో నుంచి బయటికి దిగమని చెయ్యి పట్టి లాగారు. అనంతరం అంగన్వాడీలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. **మంత్రాలయం** నుంచి కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న అంగన్వాడీలను అరెస్టు సిగ్గుచేటని సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు విమర్శించారు.

స్త్రీ విద్యతోనే దేశాభివృద్ధి

- యుటిఎఫ్ సీనియర్ నాయకులు శాంతిరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్త్రీ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని యుటిఎఫ్ సీనియర్ నాయకులు, మాచుమాన్‌దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శాంతిరాజు తెలిపారు. బుధవారం మండలంలోని మాచుమాన్‌దొడ్డి గ్రామంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపకుండా ఉన్నత విద్యలు చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు అపర్ణ లతను ఉపాధ్యాయులు సన్మానించారు. సావిత్రి బాయి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు వీరేష్, రాజు, మునిస్వామి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

బాలికల జూనియర్ కళాశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రాము పాల్గొన్నారు. **హొళగుంద**లో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ సిహెచ్.నాగరాజు మాట్లాడారు. దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేష్, బుడగ జంగాల నాయకులు రామాంజనేయులు, ముగ్గు గోవింద, దళిత సమాఖ్య నాయకులు దేవేంద్ర, శివ, వీరేష్, హుస్సేని, గోవిందు, మల్లయ్య పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, ఎపి డికెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపి డికెస్ మండల అధ్యక్షులు మారేష్, డప్పు కళాకారులు కిష్టన్న, రంగన్న, నరసింహుడు, రంగస్వామి, జి.రంగన్న, ఆటో యూనియన్ నాయకులు ఈరన్న గౌడ్, వీరేష్, రంగన్న, హమాలీ యూనియన్ నాయకులు హనుమంతు, శంకర్, మునెప్ప, నాయకులు డబల్ రాముడు, ముల్లా షేక్ సాహెబ్, టిసి.వెంకటేష్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు జయలక్ష్మి, సయ్యదా సబిహా పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శిరీష, రామలక్ష్మి, ముంతాజ్, కళావతి పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కౌతాళంలో నివాళులర్పిస్తున్న ప్రతిభ హైస్కూల్ సిబ్బంది

ఘనంగా మారికాంబ దేవి దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని పొదలకుంట, కాత్రికి, నది చాగి, గోతుల దొడ్డి, మురళీ గ్రామాల్లో మారికాంబ దేవి గ్రామ దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం దేవర ఉత్సవాల్లో భాగంగా దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, గ్రామీణ ఆటలతో బంధుమిత్రులతో పండగ వాతావరణం నెలకొంది. వివిధ గ్రామాల్లో తమ అభిమాన నాయకుల ఫ్లెక్సీలు వేశారు. గోతులదొడ్డి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య ఇంటి వద్ద పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పొదలకుంట, కాత్రికి గ్రామాల్లో టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, నాయకులు చెన్న బసప్ప, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్, వెంకటరెడ్డి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.



పూజలు నిర్వహిస్తున్న తిక్కారెడ్డి, నాయకులు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఈడిగ గోపాల్ కిరాణషాపు విద్యుదాఘాతంతో కాలిపోవడంతో బాధిత గోపాల్‌ను పరామర్శించి, అధైర్య పడొద్దు అండగా ఉంటామని వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి హామీ ఇచ్చారు. బంకు దగ్ధం విషయం తెలుసుకున్న ఆయన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సుంకేశ్వరి గ్రామానికి చేరుకుని దగ్ధమైన బంకును, కిరాణ షాపులోని వస్తువులు కాలి బూడిదపాలయిన వస్తువులను పరిశీలించారు. వైసిపి సేవాదళ్ నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, సర్పంచి ముక్కరన్న ఉన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.317/2023

బి.లక్ష్మమ్మ. ...వాది

-Vs-

పి.సామ్యుయేల్. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

పి.సామ్యుయేల్ తండ్రి పి.సుందరరాజు, వయస్సు 50 సంవత్సరాలు, ప్రస్తుత నివాసం, ఇంటి.నెం.77-41-42,కల్లూరు ఎస్టేట్,కల్లూరు మండలం, కర్నూలు సిటి.

పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ.1,19,530/-లు మరియు 24% ప్రకారం వడ్డీ, కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 24-01-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందు మూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :24-01-2024

ఎ.ఉమాదేవి,
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.



ప్రజలతో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

టిడిపితోనే అభివృద్ధి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. బుధవారం ఆదోనిలోని న్యూ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ నగర్‌లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే పథకాల గురించి వివరించారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు పింఛను రావడం లేదని విమర్శించారు. అర్హులకు ఇల్లు కూడా అందడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మురళీ, సాధిక్ వలీ, గిరి, వడ్డెమాన్ గోపాల్, రాఘవ రెడ్డి, బాబురావు, నాగేంద్ర, లక్ష్మీకాంత్ రెడ్డి, పరమేష్, భరత్ కుమార్, వీరేష్ పాల్గొన్నారు.

గంజిహళ్లి, తెర్నేకల్ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి

రూ.43.80 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామం నుంచి గంజిహళ్లి గ్రామానికి వెళ్లే హంద్రీ వాగు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.43.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణ సమస్యను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అందుకు స్పందించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్పంచి అరుణ్ కుమార్, ఎబిఎం సంఘం పెద్దలు ఫిలిప్, ఏసేపు, ఏసన్న, శ్యామ్సన్, మదన్న, వైసిపి నాయుకులు వాల్మీకి రాఘవేంద్ర, ఈరన్న, నాగన్న, లింగన్న, పులి నరేష్ ఎమ్మెల్యే కేశవ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌జిఓ హోం అక్రమ లీజుపై న్యాయ పోరాటం

- అడ్డదారుల్లో స్థలాన్ని కైవసం చేసుకున్న ఎమ్మెల్యే
- టిడిపి మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం

ప్రజాశక్తి - ఆదోని

అక్రమ మార్గంలో ఎన్‌జిఓ హోం స్థలాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అనుచరులు కైవసం చేసుకున్నారని, దీనిపై కోర్టులో పిల్ వేసి న్యాయ పోరాటానికి దిగుతామని టిడిపి నాయకులు, వ్యాపారవేత్త ఉమ్మి సలీం తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదోనిలోని ఉద్యోగ, కార్మికులకు 70 ఏళ్లుగా ఆశ్రయమిస్తున్న ఎన్‌జిఓ హోంను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అండతో ఆయన అనుచరుడు ఎర్రి స్వామి 99 ఏళ్ల అక్రమ లీజు దక్కించుకొని ఎన్‌జిఓలకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ ఎన్‌జిఓ హోం అక్రమ లీజు రద్దు కోసం హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కింద పిల్ దాఖలు చేస్తున్నట్లు వివరించారు. పట్టణ నడిబొడ్డు ఎస్‌కెడి కాలనీలో అప్పట్లోనే ఆదోనిలో పనిచేస్తున్న ఎన్‌జిఓలు, కార్మికులు రూపాయి రూపాయి కూడపెట్టి స్థలాన్ని కొనుగోలు చేసి ఎన్‌జిఓ హోం నిర్మించుకున్నారని, దానిని ఎమ్మెల్యే 99 ఏళ్ల తరతరాలకు ఒక ఆస్తిగా చేశారని విమర్శించారు. కార్మిక, ఉద్యోగుల సమాధులపై నిర్మించిన ఎన్‌జిఓ హోం స్థలంలోని భవనంలో వైసిపి కార్యాలయం బోర్డు పెట్టి పంచాయితీలు చేస్తూ ఎమ్మెల్యే, ఆయన తనయుడు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎన్‌జిఓ హోం స్థలంపై కన్నేసిన ఎమ్మెల్యే ఎలాగైనా దక్కించుకోవాలని, హోం నిర్వాహకులైన రమేష్ రెడ్డి, వెంగల్‌రెడ్డి సహకారంతో ఆయన అనుచరుడు ఎర్రిస్వామికి 2021లో లీజు రిజిస్టర్ చేయించుకున్నారని చెప్పారు. ఈ భవనానికి బాడుగ ఎంత అనే విషయాన్ని కూడా నిర్ణయించలేదని తెలిపారు. 99 ఏళ్లకు ఏ నిబంధన ప్రకారం లీజుకు చేసుకున్నారో వారే చెప్పాలని పేర్కొన్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై, చివరకు తన తల్లిపైనా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. తాను భయపడే ప్రసక్తే లేదని, ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. నాయకులు మహ్మద్ షేర్, సమీర్, నాగరాజ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మి సలీం



గురురాజ్ దేశాయిని సన్మానిస్తున్న యువకులు

గురురాజ్ దేశాయి యూత్‌లో చేరిక

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె గ్రామానికి చెందిన 50 మంది యువకులు గురురాజ్ దేశాయి యూత్ అసోసియేషన్‌లో చేరారు. బుధవారం నందవరంలోని నాగలదిన్నె రోడ్డు ఊరు చివర నుంచి బాణసంచా, డ్రమ్స్‌తో బయల్దేరి దేశాయి నెట్ వర్క్ కార్యాలయానికి చేరుకొని దేశాయి నెట్‌వర్క్ అధినేత గురు రాజ్ దేశాయిని శాలువా, పూలమాలతో సన్మానించారు. దేశాయి యూత్ అసోసియేషన్‌లో నాగలదిన్నె యువకులు మల్లి, జక్కల దస్తగిరి, చంటి, రవి కుమార్, ఉరుకుంద, వినోద్, హాజిరలీ, వడ్డే మోహన్, సలీమ్, మునాఫ్, సాధిక్, చౌడప్ప, వీరేష్, పులికొండ, రమేష్ చేరారు.

హామీ నిలబెట్టుకోవాలి

- 15వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె
- సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఉద్యోగులందరూ కోరారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు 15వ రోజు సమ్మె కొనసాగించారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి ఉపాధ్యక్షులు మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి రంగన్న మాట్లాడారు. చాలీచాలని జీతాలతో మండల విద్యాశాఖలోని కార్యాలయంలో మెసెంజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, సిఆర్ఎంటి, కెజిబివిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ చేస్తారని ఎదురుచూస్తుంటే కేవలం 10 వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేయడం అన్యాయమని చెప్పారు. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు వీరన్న, తిప్పన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాయకులు నాగరత్నమ్మ, సాయి బేస్, మల్లికార్జున, బీచుపల్లి, గౌస్, నాగవేణి, యోహాన్ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

మేం మారం.. మేమింతే...

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - కోసిగి

'మేం మారం.. మా రూటే సపరేటు' అనే విధంగా ఉంది కోసిగిలోని సచివాలయ సిబ్బంది పనితీరు. సచివాలయాలే తన పాలనకు గీటురాయిగా భావిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు వారు తూట్లు పొడుస్తున్నారు. కోసిగిలోని 4వ సచివాలయ సిబ్బంది ఇష్టమొచ్చిన సమయానికి కార్యాలయానికి చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ లేక నీరుగారుతోంది. ఉదయం 10 గంటలకు సచివాలయ సిబ్బంది విధులకు హాజరు కావాలి. బుధవారం ఉదయం 10.25 గంటలైనా విధులకు హాజరుకాలేదు. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నేషన్ అంటూ అటెండెన్స్‌కు ఎన్నో సాంకేతిక అంశాల అమలు చేసినా సిబ్బంది మాత్రం వారికి ఇష్టమొచ్చిన సమయంలో వస్తున్నారు. ఉద్యోగులే సమయపాలన పాటించకపోతే ప్రజలకు సేవలు ఏం అందిస్తారంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయేతర భూములకు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. బుధవారం మండలంలోని గోనబావి, మండగిరి, బసాపురం, కల్లుబావి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకోగా తనిఖీ చేసినట్లు తెలిపారు. అనంతరం మండగిరి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక మాసంలో సచివాలయం ద్వారా ఎన్ని సేవలు అందించారని ఆరా తీశారు. అలాగే ఆదోని పౌర సరఫరాల గోడౌన్‌ను తనిఖీ చేశారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్ఐ జయరాం రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు తెలిసి ఉండాలి

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సర్పంచి ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, వాటి గురించి ప్రజలకు తెలిసి ఉండేలా చూసుకునే బాధ్యత సచివాలయ అధికారులపై ఉందని ఎంపిపి జూటూరు హేమలత భర్త, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సర్పంచి ప్రేమ్ కుమార్ సచివాలయ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని నేమకల్లు సచివాలయ కార్యాలయంలో ప్రభుత్వం పింఛన్లు పెంపుదలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కార్యక్రమంలో జూటూరు మారయ్య, సర్పంచి ప్రేమ్ కుమార్, ఎంపిటిసిలు సుంకన్న, భీమ లింగ, ఇఒఆర్‌డి బాలన్న, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సరైన సమయంలో సరుకులు సరఫరా చేసే డ్రైవర్ శ్రీరామ్ (30) గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం సహాయం కింద రూ.10 వేలు అందజేస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సర్పంచి ప్రేమ్ కుమార్, అధికారులు తెలిపారు. గుండెపోటుతో చిన్న వయస్సులోనే శ్రీరామ్ మృతి చెందడం బాధాకరమని తెలిపారు.



శ్రీరామ్ మృతదేహాన్ని సందర్శిస్తున్న నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.260/2022

ఆంధ్రప్రగతి ప్రగతి గ్రామీణ బ్యాంకు క్రిష్ణనగర్ బ్రాంచి, కర్నూలు, రెప్రజెంటెడ్ బై ఇట్స్ మేనెజరు. ...వాది

-వర్సెస్-

రాజు పొదుపు లక్ష్మి గ్రూప్, కర్నూలు, రెప్రజెంటెడ్ బై ఇట్స్ మొదటి లీడర్ మరియు రెండవ లీడర్ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

1 నుండి 10 వరకు ప్రతివాదులకు దావా సమన్లు

1. డి.నర్సుబాయి భర్త డి.సురేష్ బాబు, మొదటి లీడర్, ఇంటి.నెం. 83-27-30,శరీన్‌నగర్,కర్నూలు.
2. యం.మద్దమ్మ భర్త యం.సుంకన్న, రెండవ లీడర్, ఇంటి.నెం. 83-32-130-52,శరీన్‌నగర్,కర్నూలు.
3. ఆదిలక్ష్మి భర్త కె.సుధాకర్, ఇంటి.నెం.83/151, శరీన్‌నగర్,కర్నూలు.
4. ఎ.సత్యమ్మ భర్త ఎ.మాదన్న, ఇంటి.నెం.83/37-130-62,శరీన్‌నగర్,కర్నూలు.
5. యం.బాలరంగమ్మ భర్త యం.శ్రీనివాసులు, ఇంటి.నెం.83/37-130,శరీన్‌నగర్,కర్నూలు.
6. పి.బడేబీ భర్త పి.నజీరుద్దీన్, ఇంటి.నెం.83/181,శరీన్‌నగర్,కర్నూలు.
7. యస్.సీలర్ బీ భర్త యస్.మాభాష, ఇంటి.నెం.83/37-130-54, శరీన్‌నగర్,కర్నూలు.
8. లక్ష్మి భర్త చంద్రన్న, ఇంటి.నెం.83/171, శరీన్‌నగర్,కర్నూలు.
9. లావణ్య బాయి భర్త కె.నరసింహారావు, ఇంటి.నెం.83/27-814,శరీన్‌నగర్,కర్నూలు.
10. డి.మౌలిబాయి భర్త డి.నర్సోజీరావు, ఇంటి.నెం.83/37-130-2,శరీన్‌నగర్,కర్నూలు.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తం రూ.1,20,442/- లు ఇందుపైన వడ్డీ,కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాదులైన మీకు పై కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీకు చేరనందున కోర్టువారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ప్రతివాదులైన మీకు ఏమైన అక్షేపణలు ఉన్న యెడల 30-01-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన అక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 30-01-2024

బి.అమరనాథ్,
వాదిపరం న్యాయవాది, కర్నూలు.

ప్రజాశక్తి
గురువారం 4 జనవరి 2024 5
నంద్యాల





ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

అంగన్‌వా'డీ'



కలెక్టరేట్ వద్దకు భారీగా వచ్చి బైఠాయించిన అంగన్వాడీలు

- పట్టణంలో భారీ ర్యాలీ - కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తాం
- ప్రభుత్వ, అధికారుల బెదిరింపులకు బెదిరేది లేదు
- ఆందోళనకు పలు ప్రజా సంఘాల నేతలు సంఘీభావం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ. 26 వేలు, పదవి విరమణ పొందిన తర్వాత రూ. 5 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఫేస్ యాప్‌లను ఎత్తివేయాలని, మెస్ చార్జీలు పెంచాలని, గ్రాట్యుటీ పెంచాలని, సుప్రీం తీర్పును అమలు చేయాలని తదితర డిమాండ్లతో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నంద్యాల కలెక్టరేట్‌కు కదం తొక్కారు. జిల్లా వ్యాప్తంగా అంగ న్వాడీలు జిల్లా కేంద్రానికి భారీ సంఖ్యలో తరలిరావడంతో కలెక్టరేట్ ప్రాంతం నినాదాలతో దద్దరిల్లింది. అంతకుముందు అంగన్‌వాడీలు సిఐటియు కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వ హించారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అటు వైపు వెళుతుండగా ఆయన కాన్వాయ్‌ని అంగన్వాడీలు అడ్డుకున్నారు. పోలీసులు సర్ది చెప్పడంతో ఎమ్మెల్యే వాహనాన్ని వదిలిపెట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్ వాడీలు కలెక్టరేట్ వద్ద రోడ్డుపై అంగన్వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు.

(మిగతా వార్త 6లో...)

ఆధార్ ఉంటేనే ఉపాధి

- ఉపాధి కోతకు కేంద్రం కుట్ర - ఆధార్‌తో వేతనానికి అనుసంధానం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నిరుపేదలకు ఆసరాగా నిలుస్తున్న ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం పలురూపాల్లో తూట్లు పొడుస్తూ వస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ఉపాధి కుదింపు చర్యలు మొదలుపెట్టింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా ఉపాధి హామీకి ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్‌ను ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తోంది. నేషనల్ పేమెంట్ ఇండియా లిమిటెడ్ ద్వారా కూలీలకు వారి ఖాతాల్లో డబ్బులు వేసేందుకు గతేడాది కాలంగా ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది. ప్రభుత్వం అనుకున్న పని నెరవేరడంతో అమలుకు సిద్ధమైంది...

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తూ వస్తోంది. తొలుత యాక్టివ్ వర్కర్లతో పేరుతో కుదింపు చర్యలు మొదలుపెట్టింది. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 నుంచి ఎపిని కూడా ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. ఆ క్రమంలో కూలీలు కొన్ని సౌకర్యాలను కోల్పోయారు. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు. ఎండలతో భూమి గట్టిపడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవిభత్యం కింద అదనంగా చెల్లించేవారు. 2021-22 నుంచి దాన్నీ ఆపేశారు. కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ ఆపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానాన్నీ నిలిపేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కూలీలకు తానే డబ్బులు చెల్లిస్తూ వస్తోంది. ఇకపై చెల్లింపులన్నీ తానే చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చెల్లింపు బాధ్యతలను నేషనల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్)కు అప్పగించింది. వారు కూలీలకు సంబంధించిన వివరాలతో పాటు బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లను సేకరించారు. ఈ ప్రక్రియలో ఆధార్ నంబరుకు, ఎన్‌పిసిఎల్‌కు లింకు కుదరలేదు. దీంతో బ్యాంకు ఖాతాతో ఉన్న ఆధార్ నంబరును ఒకసారి తొలగించి, కొత్తగా లింక్ చేయించాలని అధికారులకు సూచించింది. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ పని చేయించినా చాలాచోట్ల కుదరలేదు. లింక్ కాని వారితో పోస్టల్ ఖాతాలనూ తెరిచారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో విడిచిపెట్టేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే జిల్లాలో 4.72 లక్షల కూలీలు ఉండగా 4.67 లక్షల మంది కూలీల వివరాలు ఆధార్‌తో లింక్ అయ్యాయి. వీరిలో ఆధార్ లింక్ కాని వారు, వలసలు వెళ్లిన వారి వివరాలు అనుసంధానం కాలేదు. ఆధార్ అనుసంధనం లేకపోవడంతో వీరంతా ఉపాధి పనులకు దూరంగా కానున్నారు. అప్‌డేట్ అవుతున్న వారిని మినహాయించి 99 శాతానికి పైగా అనుసంధానం పూర్తయినట్లు లెక్కలు చెప్తున్నారు. చెల్లింపులే అసలు సమస్యఇప్పటివరకు కొత్త విధానం ద్వారా కూలీలకు ఇంకా చెల్లింపులు ప్రక్రియ మొదలు కాలేదు. డబ్బులు ఖాతాలో వేస్తే ఎంతమందికి జమ అయ్యాయో, ఎంతమందికి కాలేదో తెలుస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 12,350 మందికి పని కల్పిస్తున్నారు.

బెదిరింపులకు దిగడం తగదు

- డిఇఒ వివేకం మర్చి మాట్లాడుతున్నారు
- సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఏసి నేతలు



డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను, కేజీబీవిలలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి వేతనాలు పెంచాలని 15 రోజుల నుండి సమ్మె చేస్తున్న ఉద్యోగులపై డిఇఒ బెదిరింపులకు పాల్పడుతున్నారని సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఏసి పోరాట కన్వీనర్ ఇదాయతుల్లా, కో కన్వీనర్ కాంతారావు, కెజిబివి టీచింగ్, నాన్ టీచింగ్ జెఏసి నాయకురాలు సుమలత అన్నారు. బుధవారం డిఇఒ సుధాకర్ రెడ్డి చర్యలను నిరసిస్తూ కేజీబీవీలలో పని చేస్తున్న మహిళ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. డిఇఒ రాజరికాన్ని మరిపిస్తున్నారని, టర్మినేటర్ లెటర్‌లు ఇస్తామన్న డీఈవో ఎక్కడ అంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 15 రోజులుగా సమగ్ర శిక్ష శాఖలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు సంఘీభావం తెలిపి మాట్లాడారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవం రోజు మహిళా ఉపాధ్యాయులను అసభ్యకరంగా మాట్లాడటం, అవమానించడం డీఈవో సుధాకర్ రెడ్డికి తగదన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసిఉపాధ్యక్షులు నీరజ, ట్రెజరర్ కాంతారావు, కార్యదర్శులు రమాదేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్ద పీట

- జిల్లాలో 2,24,228 పెన్షన్‌దారులకు రూ.66.64 కోట్ల లబ్ది
- కొత్తగా 3,171 మంది పెన్షన్‌దారులకు రూ. 95 లక్షల 13 వేలు పంపిణీ
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్



లబ్ధిదారులకు పెన్షన్ పత్రం పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసుందని, జిల్లాలో 2,24,228 పెన్షన్‌దారులకు రూ.66.64 కోట్ల లబ్ధి చేకూరుస్తున్నామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి పెంచిన పెన్షన్ల లబ్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్ డిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల ఆర్థికాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ మిగతా 6వ పేజీలో...



యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పగిడ్యాల : యుటిఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఎంఈఓలు సుభాన్, మురళి మోహన్ రెడ్డి బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యుటిఎఫ్ నిత్యం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ, పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు రంగస్వామి, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రావు, సహాయ అధ్యక్షులు వేదవాసు, ఆర్థిక కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శులు శ్రీనివాసులు, అబుఖాసిం, ఎంఆర్సి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు వదిలి పంటలను కాపాడాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్ : వెలుగోడు రిజర్వాయర్ నుంచి సిద్దాపురం చెరువుకు నీళ్ల వదలి, ఆ నీటిని పంట పొలలకు వదిలి పంటలను కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దాపురం చెరువుకు వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీళ్ల వదిలి, ఆ నీటిని సిద్దాపురం చెరువు కింద పంట పొలాలకు వదలాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు శంకర్, వీరన్న, సంజీవ రాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు సామన్న, నాయకులు నరసింహ నాయక్, స్వాములు, రామ్ నాయక్, అంబయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



కెజి రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

నిజాన్ని నిర్భయంగా రాసే పత్రిక ప్రజాశక్తి : మంత్రి

ప్రజాశక్తి - ప్యాపిలి

నిజాన్ని నిర్భయంగా, ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్న పత్రిక ప్రజాశక్తి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్యాపిలిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మిక, కర్షక, పీడిత వర్గాల గొంతుకగా, ప్రజల పక్షాన ప్రజాశక్తి పత్రిక నిలబడి ముందుకు సాగుతుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మీట్ చైర్మన్ శ్రీరాములు, జడ్పీటీసీ శ్రీరామరెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పుల్లారెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీడీఓ ఫజల్ రహిమాన్,బోరా మల్లి, కమతం భాస్కర్ రెడ్డి, కొండయ్య, సోమశేఖర్, ఇమాముద్దీన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పి చైర్మన్

బ్యాంక్ ఉద్యోగాలు సాధనలో

గురు రాఘవేంద్ర విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు 2023 అకడమిక్ సంవత్సరానికి గాను రీజినల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్‌బి) ఐబీపీఎస్ బ్యాంకులలో 115 ఆఫీసర్స్, 200కు పైగా క్లరికల్ ఉద్యోగాలు సాధించినట్లు గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డా. పి.దస్తగిరి రెడ్డి తెలిపారు. బుధవారం కోచింగ్ సెంటర్ ఆవరణలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి.మౌలాలి రెడ్డి మాట్లాడుతూ తమకున్న ఒకే బ్రాంచ్‌లో దేశంలోనే అధికంగా ఆఫీసర్స్, క్లరికల్ ఉద్యోగాలను తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. 1989 నుండి 2023 సంవత్సరం వరకు మా కోచింగ్ సెంటర్ నుండి 42 వేల మంది విద్యార్థులు బ్యాంకు ఉద్యోగాలను సాధించారన్నారు. నేటితరం విద్యార్థులకు ఆధునిక టెక్నాలజితో కూడిన విద్యావిధానాలతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నా మనడానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. 2024 సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో వేలాదిగా ఆఫీసర్స్, క్లరికల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడుతాయని చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న యువతీ ,యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనతి కాలంలో బ్యాంకు ఉద్యోగులుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతీ యువకులకు అతి తక్కువ ఫీజులతోనే ఉద్యోగం వచ్చేంత వరకు శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిలభారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ జి మద్దయ్య యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బత్తులూరుపాడు సమీపంలో శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘం క్యాలెండర్‌ను పాండురంగ యాదవ్ అధ్యక్షతన యాదవ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు విద్య, ఉద్యోగ ,రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. యాదవులను అన్ని రాజకీయ పార్టీలు ఓట్ బ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలు, ఒక పార్లమెంటు స్థానాన్ని యాదవులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదవులు ఐకమత్యంతో అభివృద్ధి సాధించాలన్నారు. విద్యతోనే అభివద్ధి సాధ్యమని తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. త్వరలో అన్ని గ్రామాలలో యాదవ సంఘం సమావేశాలు ఏర్పాటు చేసి యాదవులను చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎర్రగుడి గణ మద్దిలేటి యాదవ్, ప్రధాన కార్యదర్శి శంకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు పర్లపాటి చంద్రుడు యాదవ్, ట్రెజరర్ రంగస్వామి యాదవ్, కార్యదర్శి పర్లపాటి గోపాల్ రాజు యాదవ్, నందవరం యాదవ అన్న సత్రం అధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు యాదవ్, నాయకులు జి.రామపుల్లయ్య యాదవ్, ఫతేనగరం లక్ష్మయ్య యాదవ్, పెండేకంటి బాలసుబ్బయ్య యాదవ్, సానేం బాల తిమ్మయ్య యాదవ్, చీరాల వెంకటేశ్వర్లు యాదవ్, మనోహర్ యాదవ్, కొంగని పవన్ కుమార్ యాదవ్, పిల్లి నాగయ్య యాదవ్, తిమ్మరాజు యాదవ్, కుమారస్వామి యాదవ్, మూలింటి శేఖర్ యాదవ్, మంగంపేట రమణ యాదవ్, బాలాంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు



వాహనాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి

అరటి రైతులు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - మహానంది : అరటి రైతులు ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మహానందిలో రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అందజేయుటకు, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కు తరలించడంలో భాగంగా మహానంది అరటి రైతు ఉత్పత్తి దారుల కంపెనీకి నాబార్డ్ వారు కేటాయించిన మొబైల్ రూరల్ మార్ట్ వాహనంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ వారు 65 శాతం గ్రాంట్‌ను యివ్వగా అరటి ఎఫ్‌పిఓ మిగతా నిధులను తమ వాటా కింద చెల్లించి మొత్తం రూ. 10 లక్షల 50 వేలతో వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎఫ్‌పిఓలో చేరిన ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ వాహనం అందిస్తున్నామని చెప్పారు. నవ యూత్ అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ ఎఫ్‌పిఓ పరిధిలోని పంట ఉత్పత్తులను సకాలంలో అమ్ముకొనుటకు ఈ వాహనం చాలా ఉపయోగకరంగా ఉంటుందని, సమయం, ఖర్చులు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సురేంద్ర కుమారి, ఎఫ్‌పిఓ చైర్మన్ పి.లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని బాచేపల్లే నుంచి అహోబిలం రోడ్డులో నూతనంగా 4.52 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజెంద్రా రెడ్డి(నాని), నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఏపీఎస్పిడిసియల్ డైరెక్టర్ శశికళ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉప కేంద్రం ద్వారా బాచేపల్లి, బాచేపల్లి తండా, కొండంపల్లి గ్రామాలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాను అందించవచ్చున్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ ఉమాపతి, ఈఈలు రమణారెడ్డి, నాగేశ్వరరావు, లత, డిఇఇ రవికాంత్ చౌదరి, ఎఇ హుస్సేన్ బాషా తదితరులు ఉన్నారు.



ప్రారంభిస్తున్న దృశ్యం



డోన్ మున్సిపల్ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కెడిసిసిబి చైర్మన్ విజయ మనోహారి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి

డోన్ అభివృద్ధి పనులను పరిశీలించిన కెడిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి-డోన్ : డోన్ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉమ్మడి జిల్లా కెడిసిసిబి చైర్మన్ ఎస్.వి.విజయమనోహారి, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.మోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో అత్యంగా వేగంగా అభివృద్ధి పనులు జరగడం సంతోషంగా ఉందన్నారు. వందపడకల హాస్పిటల్, స్విమ్మింగ్‌ఫూల్, పంప్‌హౌస్, పార్కులు, మున్సిపాలిటీ కోసం నిర్మించిన కొత్త భవనాన్ని, అతిథి గృహాన్ని, పార్కులు, ఇండోర్ స్టేడియం, రహదారుల విస్తరణ తదితర పనులను పరిశీలించారు. ఎస్.వి.మోహన్‌రెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ వారికి డోన్‌లో నిర్వహిసుత్ను అభివృద్ధి పనులను చూపించారు. స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల : పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పీఆర్సీ, డిఏ, సరెండర్ లీవ్ తదితర ఆర్థిక బకాయిలు రూ. 18 వేల కోట్లు తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల బొమ్మల సత్రం సర్కిల్ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాము దాచుకున్న డబ్బును తమ అవసరాలకు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. గత 11వ పీఆర్సీ బకాయిలు తీర్చనే లేదని, ఆఘమేఘాల మీద 12వ పీఆర్సీ ప్రకటించారని, అదేం ప్రేమతో కాదని, ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పారని, నిజంగా చిత్త శుద్ధి వుంటే బకాయిలన్నీ తీర్చి ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాంమోహన్, జయమ్మ, సుబ్బరాయుడు, నాగ స్వామి నాయక్, సుజాత, సత్య ప్రకాష్, శాంతిప్రియ, వెంకటేశ్వర రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, కిషోర్, షమిం భాను, సంధ్యా జ్యోతి, లక్ష్మి రామకృష్ణుడు, నరసింహ రెడ్డి, ప్రతాప్, ఖాసీం, అమీర్ అహ్మద్, లతీఫ్, గోపాల్, వెంకటేశ్వర్లు, ప్రేమ కాంత్, శ్రీధర్ రావు,రహీం, రామకృష్ణ, రఫీ, వై.రమణ, సర్వజ్ఞ మూర్తి, బాలస్వామి, లక్ష్మీకాంత్ నాయక్, సంజీవ రాయుడు, చంద్రమోహన్, చంద్ర శేఖర్, చంద్ర, సుమన్, రమేష్ నాయుడు, మనోహార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

పేదల సంక్షేమానికి పెద్ద పీట

5వ పేజీ తరువాయి.. పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. ఈ జనవరి మాసం నుండి కొత్తగా 3,171 మంది పెన్షన్‌దారులకు రూ.95 లక్షల 13 వేల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అవ్వ తాతలు, వితంతువులు, వికలాంగులకు ఇకపై ప్రతినెల రూ.2,750 నుంచి రూ.3వేల చొప్పున పెంచిన పెన్షన్ లబ్ధిని అందజేస్తారని తెలిపారు. మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సర్వీసులను ప్రజల ముంగిటకే తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు పెన్షన్‌దారులకు మెగా చెక్కును అందజేశారు. **మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పంపిణీ చేసిన ఎమ్మెల్యే :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ రవి చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుపుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని ఎంపిడిఓ మీటింగ్ హాల్‌లో పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం పెంచిన పెన్షన్ పంపిణీతో పాటు ఆదుదా-ఆంధ్ర కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమలత, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఎపిఓ కోఆర్డినేటర్ పుల్లయ్య, సర్పంచులు శోభ లత, చంద్రశేఖర్ యాదవ్, విజయ కుమార్, మోహన్న, ఎంపిటీసీ స్రవంతి, వైసిపి మండల నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **డోన్ :** ఆశేష జన సందోహం మధ్య వైయస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. డోన్ పట్టణంలోని స్థానిక షాదీఖానాలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన వైయస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ విశ్వసనీయతకు అర్థం చెబుతూ పెన్షన్లను క్రమంగా రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతామని ఇచ్చిన హామీని సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. పట్టణంలో 5597 మందికి రూ. 3 వేల చొప్పున 1 కోటి 68 లక్షల 74 వేల రూపాయలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యులు వైయస్సార్ రఫీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



నంద్యాలలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్



కొత్తపల్లి : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



డోన్ : పింఛన్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్



ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వా 'ఢీ'

5వ పేజీ తరువాయి..

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు డి.నిర్మలమ్మ అధ్యక్షతన ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు మాట్లాడారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడీల సమస్యల పట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు 23 రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించకపోగా సచివాలయ ఉద్యోగులతో అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టించి సమస్యను మరింత జటిలం చేస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీలు ఏళ్లతరబడి నుండి చాలీచాలని జీతాలతో జీవితాలు గడుపుతున్నారన్నారు. గెస్ట్‌హౌస్ కట్టుకోవడానికి రూ. 450 కోట్లు ఖర్చు పెడుతున్న సిఎంకు అంగన్‌వాడీల జీతాలు పెంచడానికి రూ. 300 కోట్లు లేవా అని ప్రశ్నించారు. సచివాలయం ఉద్యోగులతో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించడంలో సిఎం విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సక్రమంగా అంగన్వాడీ సేవలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేభారాణి, నిర్మలమ్మ మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని 23 రోజులుగా రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.మద్దులు, జిల్లా నాయకులు రత్నమయ్య, భాస్కర్, ఎల్లయ్య, వి.బాల వెంకట్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.నిర్మల తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగరాణి, డి.నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ కార్యదర్శి బి.సునీత, నంద్యాల ప్రాజెక్టు అధ్యక్షురాలు రమణమ్మ, సెక్టార్ లీడర్స్ ప్రసన్న, సరస్వతి, నీలిమ, లలితమ్మ, సునీత, వరలక్ష్మి, సారమ్మ, సావిత్రి, అరుణ, రత్నమ్మ, జిల్లా నలుమూలల నుండి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సుండిపెంటలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాశమ్మ, రమణమ్మ, ఏఐటీయూసీ నాయకులు ఓబులయ్య, ఐఎఫ్‌టియు నాయకులు ఆశీర్వాదం, సిపిఐ నాయకులు పులిరాజు తదితరులు తహసీల్దార్ రాజేంద్రసింగ్‌కు వినతి ప్రత్రాన్ని అందజేశారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి నిర్మలమ్మ

9వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె

- నంద్యాలలో అర్ధనగ్నంగా, ఆత్మకూరులో ఉరితాళ్లతో నిరసన
- మాజీ ఎమెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సంఘీభావం - నందికొట్కూరులో సిఎం చిత్రపటానికి వినతి



నంద్యాలలో అర్ధగన్న ప్రదర్శనలో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె నంద్యాల జిల్లాలో బుధవారం 9వ రోజు కొనసాగింది. నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు అర్ధ నగ్నంగా కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు కృష్ణయ్య అధ్యక్షత వహించారు. సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే.మహమ్మద్ గౌస్, పట్టణ కోశాధికారి వెంకట లింగంలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను, అసెంబ్లీలో చెప్పిన మాటలను నెరవేర్చాలని, స్కిల్డ్, సెమి స్కిల్డ్, వేతనాలను జీవో నెంబర్ 7 ప్రకారం అర్హులైన వారందరికీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తింపచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కరాచారి, నాయకులు రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, సిద్దయ్యతోపాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, జోసెఫ్, పెద్ద నాగరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర 9వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు ఉరితాళ్లు మెడలో వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇస్మాయిల్, స్వాములు, మున్సిపల్ కార్మికులు రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారి, సుశీలమ్మ, తిమయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు. **సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మద్దతు :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 9వ రోజు సమ్మె చేస్తున్న వైసిపి ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమని టిడిపి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని, మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. **నందికొట్కూరు టౌన్ :** మున్సిపల్ శానిటరీ, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమస్యలతో కూడిన వినతిపత్రం సిఎం చిత్రపటానికి సిఐటియు ఆధ్వర్యంలో అందజేసి నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికులు సర్వర్ ఖాన్, మారెప్ప, నాగేశ్వరరావు, భాస్కర్, సుందరరాజు, శ్రీరాములు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇచ్చిన హామీ నెరవేర్చిన సిఎం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాములపాడు : ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చారని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం నందు పెంచిన పెన్షన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆర్థర్ హాజరై పెన్షన్ పంపిణీ చేశారు. పాములపాడు మండలంలో కొత్తగా మంజూరైన 51 పింఛన్లు కూడా పంపిణీ చేశారు.

మద్దూరులో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ : మండలంలోని మద్దూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం రెండో విడత కార్యక్రమంలో భాగంగా మద్దూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజినీ వర్జినీయా, ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, వైస్ ఎంపిపి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి బషీర్ అహ్మద్, డైరెక్టర్ రామసుబ్బయ్య, వైసిపి మండల కార్యదర్శి మధుసూదన్ రావు, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, సర్పంచులు మాణిక్యమ్మ, రామస్వామి, మౌలాలి, నాయకులు జబ్బార్ మాలిక్ భాష, రాములమ్మ, బాలేశ్వర్ రెడ్డి, ఉపేంద్ర స్వామి, దాసు, ఓబుల్ రెడ్డి, ఆ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రూ. 3 వేలు పెన్షన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్థర్

రైతుల సమస్యలు పట్టని వైసిపి ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

రైతుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. బుధవారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల మండలం గుళ్ళదుర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, కరపత్రాలను మాజీ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కరువు కొరల్లో చిక్కుకొని అల్లాడుతుంటే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, మండల నాయకులు శేఖర్, పేరా శ్రీధర్ రెడ్డి, నాయకులు పరమేశ్వర రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శివ నాగిరెడ్డి, శ్రీహరి, సర్పంచ్ శ్రీలత, గోవింద్ రెడ్డి, శివ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సి. రాముడు, వెంకటేశ్వర్లు, సుదర్శన్ రెడ్డి, పార్థసారథి, ప్రతాప్ రెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

రాష్ట్ర భవిష్యత్తు కోసం బాబు మళ్లీ రావాలి : మాజీ మంత్రి



మద్దూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే మళ్లీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి రావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూమా అఖిలప్రియ ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రౌడీలు గుండాలు, రాజ్యమేలుతున్నారని చెప్పారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు.

9న బాబు సభను విజయవంతం చేయాలి : ఈ నెల 9న చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, మద్దూర్ సర్పంచి లక్ష్మీ ఓబులమ్మ, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష, జిల్లా నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి మాబు షరీఫ్, మౌలాలి, సల్ల నాగరాజు,ముల్లా అజీమ్, హనీఫ్, మాబు షరీఫ్ ముల్లా షాబుల్, ముల్లా గఫార్, నూర్ భాషా, ఇర్షాద్, ఖలీల్, కొలిమి షబ్బీర్, అష్రఫ్, హుస్సేన్ పీరా ,సదాఫ్, సోను, బషీర్, జట్టి నాగరాజు, ఖాదర్, కసినేని ఓబులేష్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ఓబయ్య, ఆంజనేయులు, బాబు, పల్లి వీరయ్య, వెంకటసుబ్బయ్య, మహ్మద్ రఫీ, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ఆత్మకూరు మున్సిపాలిటీ తోటగేరి కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసిపి అరాచకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి వేణుగోపాల్, సతీష్, రామ్మూర్తి, అబ్దుల్లాపురం భాష తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

పేదల సంక్షేమమే వైసిపి లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఈద్గా నగర్‌లో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, ఆర్డబ్ల్యూఎస్ఐ సాయి కృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ మహేష్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ఎంఈఓ స్వరూప, ఎంపీపీ మానసవీణ, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, సర్పంచి ఈసారి ఎల్లమ్మ, వైసిపి నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, సూరి, గౌండా కంబగిరి, గౌండా మహబూబ్ బాషా, బాలు, నారాయణ, ఈశ్వర్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు పాటుపడాలి : సిపిఎం



పూలే చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు కోరారు. బుధవారం నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయం దగ్గర సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా నేటికీ మహిళలు అంటరాంతనానికి, వివక్షతకు, అసమానతలకు గురవుతున్నారని, చట్టసభల్లో రిజర్వేషన్లు పొందలేకపోతున్నారని తెలిపారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం అంకిత భావంతో ప్రతి ఒక్కరూ పని చేయాలని, అప్పుడే ఆమె జయంతికి సార్ధకత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రాము, జయరాని, హుసేనమ్మ, రత్నమ్మ, నరసింహులు, ఏసన్న, ఈశ్వరమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం ఆదర్శ పాఠశాలలో మహిళ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రిలోని పాత బస్టాండ్ కాలనీలో ఉన్న అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, మాజీ సర్పంచి ఎంఎస్ అన్సర్ భాష సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు షబ్బీర్, జైనుల మహబూబ్ సాబ్, విద్యార్థులు పాల్గొన్నారు. **డోన్ :** మహిళా విద్యకు పునాది కర్త సావిత్రి భాయి పూలే అని ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి అన్నారు. డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అధ్యక్షతన సావిత్రి భాయి పూలే విగ్రహానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్,సుబ్బారెడ్డి, వెంకటరమణ, రవిశేఖర్, శ్రీనివాసులు, అల్లిపీరా, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భానుప్రకాష్ రెడ్డి, భారతి, ముని రాజు, ప్రసాద్ రావు, మహేష్, అల్లిపీరా తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** మండలంలోని గోరుమానుకొండ సమీపంలో గల మోడల్ స్కూల్ నందు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ప్రిన్సిపల్ మరియదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. **ఆళ్లగడ్డ :** స్థానిక గ్రంథాలయమునందు గ్రంథాలయ అధికారి అరుణకుమారి, ఉపాధ్యాయులు కన్నయ్య, శ్రీనివాసులు వారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. **గడివేముల :** గడివేములలోని శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కరస్పాండెంట్ యం. రామేశ్వరరావు పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఎఐ యంబియన్. రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులోని వివేకానంద విద్యా విహార్ హైస్కూల్‌లో అడ్మినిస్ట్రేటర్ రాయపాటి దేవిక సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్, ఉపాధ్యాయులు సురేంద్ర, షాజహాన్, అన్వర్ భాష, నారాయణాచారి, హబీబుల్లా, స్రవంతి, హిమప్రియ, హసీనా, హరిత, స్రవంతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో సావిత్రి భాయ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత దేవి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆంగ్ల అధ్యాపకురాలు నీతమ్మ మాట్లాడారు. అధ్యాపకులు డాక్టర్ బడే సాహెబ్, ఫాతిమా, సూర్య నారాయణ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, రామకృష్ణ, నాగరాజా రెడ్డి, వహీదా పాల్గొన్నారు. **పాణ్యం :** మండల కేంద్రంలోని అన్ని పాఠశాలల్లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. **నందికొట్కూరు :** పట్టణంలోని గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హెచ్ఎం పార్వతి, ఆర్.తులసమ్మ ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం, అర్బన్ అధ్యక్షులు విజయ్ కుమార్, నాగులుటి గోకారి, యువజన సంఘం అధ్యక్షులు వడ్డే శివమణి, చింతకుంట కురుమూర్తి, నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ వెంకటరాముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమిర్ భాష ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. **కొలిమిగుండ్ల :** కనకాద్రిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపి ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలుగు పండితులు వైవిఎస్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎంఇఒ అబ్దుల్ కలాం పాల్గొని మాట్లాడారు.

వైసిపి కుట్రలో భాగమే అరెస్టు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం వైసీపీ ప్రభుత్వ కుట్రలో భాగమేనని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి ఆరోపించారు. బొజ్జ దశరథ రామిరెడ్డిని తక్షణమే విడుదల చేయాలన్నారు. నందికొట్కూరు సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న బొజ్జ దశరథ రామిరెడ్డిని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. 2016 సిద్దేశ్వరం వద్ద చేపట్టిన ఉద్యమంలో ఆయన పై ఎలాంటి కేసులు నమోదు కాలేదని, ఈ విషయం ఆనాడే పోలీసులు స్పష్టంగా ఆయనకు తెలియజేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగునీటి కోసం గ్రామ గ్రామానికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం రైతులకు చేస్తున్న అన్యాయాన్ని తెలియజేయడమే ఆయన చేసిన నేరమా అని ప్రశ్నించారు. దశరథ రామిరెడ్డి అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.